COMMUNIST PARTY OF INDIA (MARXIST)
ANDHRA PRADESH COMMITTEE
H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం: విజయవాడ,
తేది : 23 మే, 2019.

**2019 మే 31, జూన్ 1 తేదీల్లో విజయవాడలో సిపిఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం ఎం.ఏ.గఫూర్ అధ్యక్షతన జరిగింది. ఎన్నికల ఫలితాలను సమీక్షించిన అనంతరం ఈ క్రింది ప్రకటన విడుదల చేసింది.**

శాసనసభ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించి అధికారం చేపట్టిన వైసిపికి, ముఖ్యమంత్రి పదవి చేపట్టిన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి సిపిఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ కమిటీ హృదయపూర్వక అభినందనలు తెలుపుతోంది. ఎన్నికల సందర్భంగా ప్రకటించిన హామీలను నెరవేర్చడంలో కొత్త ప్రభుత్వం ఫలప్రదం కావాలని కోరుకుంటున్నాం. కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా, అవినీతి రహితంగా, పారదర్శకంగా ప్రభుత్వాన్ని నడుపుతామని ముఖ్యమంత్రి చేసిన వాగ్దానాన్ని అమలు జరపడానికి చేసే ప్రయత్నాలకు సిపిఎం తనవంతు నిర్మాణాత్మక సహకారాన్ని అందిస్తుంది.

నాలుగు లక్షల మంది గ్రామ వలంటీర్ల నియామకాన్ని చేపడతామని, తద్వారా ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సంక్షేమ పథకాలను తీసుకువస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ లక్ష్యం మంచిదే. అయితే గత ప్రభుత్వ హయాంలో 'ప్రజల వద్దకు పాలన' పేరుతో జన్మభూమి కమిటీలను ఏర్పరచి తమ అనుయాయులకే పెత్తనాన్ని అప్పగించిన అనుభవం, దానిపట్ల ప్రజల్లో వ్యక్తమైన వ్యతిరేకతను కొత్త ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని వ్యవహరిస్తుందని ఆశిస్తున్నాం. గ్రామ సెక్రటేరియట్లకు సిబ్బందిని నియమించి గ్రామస్థాయిలోనే ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించారు. సిబ్బందితో పాటు పంచాయతీలకు నిధులను, అధికారాలను బదిలీ చేయాలి. అప్పుడే పరిపాలన పారదర్శకంగా జరుగుతుంది. ఈ సిబ్బంది నియామకంలో అర్హతలను, సామాజిక న్యాయాన్ని దృష్టిలో పెట్టుకొని అమలు చేయాలని కోరుతున్నాం.

ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల అభివృద్ధి విభజన హామీల అమలు వంటి అంశాలకు కొత్త ప్రభుత్వం సముచిత ప్రాధాన్యతిచ్చి చేపట్టాలని కోరుతున్నాం. రాష్ట్రానికి న్యాయం జరిగేందుకు అన్నివర్గాల ప్రజలను కలుపుకొనిపోయే ప్రయత్నం చేయాలని, అలాంటి ప్రయత్నాలకు సిపిఎం సహకారం ఉంటుందని తెలియజేస్తున్నాం.

వివిధ ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు ప్రజాతంత్రయుతంగా చేపట్టిన ఉద్యమాలపై గత ప్రభుత్వం నిరంకుశ, కక్షపూరిత వైఖరిని అనుసరించింది. అనేక అక్రమ కేసులు బనాయించింది. ఈ వైఖరిని ప్రజలు ఈసడించుకున్నారు. కొత్త ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతులను, చర్చల ద్వారా సామరస్య పూర్వకంగా పరిష్కరించుకునే సత్సాంప్రదాయాలను అమలు చేయాలని ఆకాంక్షిస్తున్నాం. గత ప్రభుత్వ కాలంలో ఉద్యమాలపై బనాయించిన అక్రమ కేసులన్నింటినీ సమీక్షించి ఎత్తివేయాలని కోరుతున్నాం. వామపక్ష కార్యకర్తలపై రౌడీషీట్లు తెరిచారు. వాటిని ఎత్తివేయాలని కోరుతున్నాము.

పోలవరం తదితర ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసంపైన, రాజధాని రైతుల, కూలీల సమస్యలపైన కొత్త ప్రభుత్వం తగు ప్రాధాన్యతతో చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. రద్దు చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులన్నీ వెంటనే పున:ప్రారంభించాలని కోరుతున్నాం.

ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిన పలు ప్రజాహిత కార్యక్రమాలను తిరిగి పట్టాలెక్కించడం, ఖరీఫ్ వ్యవసాయ ప్రణాళిక, వార్షిక రుణ ప్రణాళికలో వ్యవసాయం, కౌలురైతులకు, కార్మికుల కనీస వేతనాల సవరణ వంటి తక్షణ చర్యలపైన కొత్త ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంది. ఆర్టీసి కార్మికుల సమస్యల్ని చర్చల ద్వారా పరిష్కరించడానికి చొరవ తీసుకోవాలి.

కేంద్రంలో ఏర్పడిన ఎన్‌డిఎ-2 ప్రభుత్వం అమలు జరిపే విధానాల స్వభావం పట్ల సిపిఎం ఆందోళన చెందుతోంది. లౌకిక రాజ్యాంగ విలువలను కాలరాసి మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య చిచ్చు రాజేసే ప్రయత్నాలు ముమ్మరం అవుతున్నాయి. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని, ఆర్థిక అధికారాలను కుదించివేసే కేంద్ర విధానాలు ఫెడరలిజానికి సవాలుగా తయారవడమే కాక రాష్ట్ర అభివృద్ధికీ ప్రతిబంధకంగా మారుతాయి. ముఖ్యంగా అన్ని కులాల, మతాల ప్రజలను కలుపుకొని పోవాలని రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి ప్రకటించిన ఆదర్శానికి కేంద్ర విధానాలు విఘాతంగా మారే ప్రమాదం ఉంది. కనుక నూతన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాల రక్షణం కోసం, ప్రత్యేకహోదా విభజన చట్టంలోని హామీల అమలు కోసం, కేంద్రం నుంచి రావాల్సిన నిధుల విడుదల కోసం, లౌకిక విలువల పరిరక్షణ కోసం గట్టిగా నిలవాలి. మతోన్మాద విషయం వెదజల్లే శక్తులపట్ల అప్రమత్తంగా వుండాలి. పెద్దసంఖ్యలో ఓట్లేసి గెలిపించిన బడుగు, బలహీన, దళిత, గిరిజన, మైనార్టీ వర్గాలకు 'నేనున్నానని' ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ఈ విషయంలో ఊగిసలాటలు లేని నిఖరమైన వైఖరిని, పటిష్ట వైఖరిని అనుసరించాలని, ఇందులో సిపిఎం సంపూర్ణ సహకారం ఉంటుందని తెలియజేస్తున్నాం.

ఎన్నికల సమయంలో రాష్ట్రాభివృద్ధి కోసం, వివిధ ప్రాంతాల, తరగతుల, ప్రజల అభ్యున్నతికి, ప్రజాస్వామ్య, లౌకిక వ్యవస్థల పరిరక్షణకు సిపిఎం, సిపిఐ ప్రజల ముందుంచిన కార్యాచరణ ప్రణాళిక అమలు కోసం రాబోయే కాలంలో కృషిని మరింత పట్టుదలగా కొనసాగిస్తామని ప్రజలకు తెలియజేసుకుంటున్నాం.

దేశవ్యాపితంగా వామపక్షాలు ఎదురుదెబ్బతిన్న నేపథ్యంలో పార్టీ నిర్మాణాన్ని పటిష్టపరుచుకొని ప్రజలకు మరింత చేరువకావడానికి, వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమాలను బలోపేతం చేయడానికి శక్తికొద్ది ప్రయత్నిస్తుందని విజ్ఞప్తి చేస్తున్నాము.

= = = =